# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దిత్వా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు.
- ❖ విశాఖపట్టణం వేదికగా వచ్చే నెల 4 తేదీన నేవీ డే విన్యాసాలు జరగనున్నాయి.
- ❖ రానున్న గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- ❖ దిత్వా తుఫాను ప్రభావంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.." కార్యక్రమం 128వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

===============

దిత్వా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖా మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. తుఫాను నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ముందస్తు చర్యలపై ఉన్నతాధికారులతో మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తుఫాను తీవ్రతను అంచనా వేసి ప్రభావిత జిల్లాలను అప్రమత్తం చేయాలని, ఆయా జిల్లాల కలెక్టర్లు ముందస్తు జాగ్రత్త చర్యలు పటిష్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. సహాయక చర్యల కోసం ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించాలని ఆదేశించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి అధికారులకు, ప్రజలకు తెలియజేయాలని తెలిపారు.

===============

విశాఖపట్టణం వేదికగా వచ్చే నెల 4 తేదీన నేవీ డే విన్యాసాలు జరగనున్నాయి. నౌకాదళ దినోత్సవ సన్నాహకాల్లో భాగంగా ఈరోజు ఏర్పాటు చేసిన ముందస్తు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ కొద్దిసేపటి క్రితం నగరానికి చేరుకున్నారు. ఈస్టర్న్ నావల్ కమాండ్ ప్రధాన కార్యాలయంలోని ఐఎన్ఎస్ సముద్రికలో

మరికొద్ది సేపట్లో ఈ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. భారత నౌకాదళం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ఈ కార్యక్రమాల్లో సముద్ర భద్రత, యుద్ధ సామర్థ్యాల ప్రదర్శనలు, నౌకాదళ సిబ్బంది ప్రతిభను చూపించే విన్యాసాలు జరగనున్నాయి.

===============

రానున్న గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని రాష్ట్ర పర్యాటక, సంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కలెక్టర్ కార్యాలయంలో గోదావరి పుష్కరాలు – 2027 ఏర్పాట్ల నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గోదావరి పుష్కరాలు కోసం ముందస్తు ఏర్పాట్లు, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై సమగ్ర సమీక్ష జరిపామని తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా పుష్కరాలకు భారీ స్థాయిలో సన్నద్ధమవుతున్నామని చెప్పారు. తెలిపారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని రవాణా, మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే ప్రతిష్టాత్మక అఖండ గోదావరి ప్రాజెక్టును పుష్కరాల నాటికి పూర్తి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

===============

రాష్ట్రంలోని విద్యా రంగంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని గార గ్రామంలో  పంచాయతీ సచివాలయాన్ని, వొమరవల్లి డైట్ కళాశాలలోని అదనపు తరగతి గదులను కేంద్ర మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల కింద 40 లక్షల రూపాయలతో నిర్మించిన సచివాలయం గార గ్రామ  ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు వీలు పడుతుందన్నారు. వొమరవల్లిలోని ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్) కళాశాల రాష్ట్రానికి మోడల్ గా నిలుస్తుందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

విరామం

===============

రాష్ట్రంలోని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. డి.ఆర్.డి.ఏ వెలుగు ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా సింగరాయకొండలో మహిళలకు మెగా రుణమేళా కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... కొండేపి నియోజకవర్గంలో డిఆర్డిఏ వెలుగు ద్వారా 105 కోట్ల రూపాయల రుణాలును మహిళలకు అందించామన్నారు. రాష్ట్రంలో మహిళల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి డ్వాక్రా సంఘాలను ప్రారంభించారన్నారు. మహిళలు ఆత్మ విశ్వాసంతో జీవించే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

===============

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 128వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

===============

నైరుతి బంగాళాఖాతం దీనిని ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో "దిత్వా" తుఫాను పుదుచ్చేరికి 280 కిలోమీటర్లు, చెన్నైకి 380 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని విశాఖపట్టణంలోని తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ఇది గంటకు 6 కిలోమీటర్ల  వేగంతో ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ.. రేపు తెల్లవారు జామున తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు దక్షిణ కోస్తా జిల్లాల్లోని పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారి ఎస్. జగన్నాథ్ కుమార్ వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

===============

దిత్వా తుఫాను నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయం నుండి వివిధ జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ ఈరోజు నిర్వహించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అదే విధంగా నెల్లూరు, కడప, అన్నమయ్య, బాపట్ల, ప్రకాశం జిల్లాలలో కూడా కొన్నిచోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాబోయే రెండు, మూడు రోజులు మత్స్యకారులు సముద్రం లోనికి వేటకు వెళ్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను విజయానంద్ ఆదేశించారు. అదే విధంగా ఆయా జిల్లాల పరిధిలోని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండే విధంగా విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్టీజిఎస్ ద్వారా తుఫాను సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ధాన్యం తడవకుండా చర్యలు తీసుకునేలా రైతులను అప్రమత్తం చేయాలన్నారు.

===============

విద్యతోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు 34 లక్షల రూపాయలతో నిర్మించనున్న మరుగుదొడ్లు, వెయిటింగ్ రూమ్ నిర్మాణ పనులకు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా  మాట్లాడుతూ... విద్యార్థులకు విద్యను అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలను పరిరక్షించుకోవాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిదీ అని అన్నారు. కళాశాలకు అవసరమైన డ్రైనేజ్‌లు, ఇతర మౌలిక వసతుల పనులను త్వరలో ఒక్కొక్కటిగా పూర్తి చేస్తామని చెప్పారు.

===============
===============